సాక్షి అనంతపురం

గురువారం । 12 । సెప్టెంబర్ । 2024



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.



టమాట కిలో రూ.26

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.26 పలికింది. కనిష్టం రూ.14, సరాసరి రూ.18 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.1°/24.4°

జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి.

న్యూస్‌రీల్

పార్ట్‌టైమ్ టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు



అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో (అంబేడ్కర్ గురుకులాలు) ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను పార్ట్‌టైమ్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు గురుకులాల కోఆర్డినేటర్ మురళీకృష్ణ తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 17న ఉదయం 11 గంటలకు కురుగుంట గురుకుల పాఠశాలలో జరిగే డెమో/వాక్ ఇన్ ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. జూనియర్ లెక్చరర్, పీజీటీ పోస్టులకు పీజీ, బీఈడీ, టెట్ అర్హత, టీజీటీ పోస్టులకు డిగ్రీ, బీఈడీ, టెట్ అర్హత (టీజీటీ హిందీకి పీజీ కూడా ఉండాలి), పీఈటీ పోస్టులకు బీపీఈడీ, టెట్ అర్హత, హెల్త్ సూపర్‌వైజర్ పోస్టులకు బీఎస్సీ నర్సింగ్ అర్హతలు ఉండాలని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 99493 54106 (కోఆర్డినేటర్) నంబరులో సంప్రదించాలని సూచించారు.

17న పారామెడికల్ కోర్సులకు అడ్మిషన్లు

అనంతపురం మెడికల్: ఈ నెల 17న ఉదయం 11 గంటలకు ప్రభుత్వ వైద్య కళాశాల (జీఎంసీ)లో పారా మెడికల్ కోర్సులకు రెండో విడత అడ్మిషన్లు చేపట్టనున్నారు. ఈ మేరకు జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. డీఎంఎల్‌టీ, డీఓఏ, డీఏఎన్ఎస్, డీఎంఐటీ, డీఈసీజీ, డీడీఆర్ఏ తదితర కోర్సులకు అడ్మిషన్లు ఉంటాయి. ఆసక్తి ఉన్న వారు ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో హాజరుకావాలి.

పచ్చమూకల వీరంగం

- వెంగన్నపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకుడి స్కార్పియో ధ్వంసం



టీడీపీ కార్యకర్తల దాడిలో ధ్వంసమైన స్కార్పియో వాహనం

యాడికి: మండలంలోని వెంగన్నపల్లిలో బుధవారం పచ్చమూకలు వీరంగం సృష్టించాయి. వైఎస్సార్‌సీపీ నాయకుడు భాస్కర్ రెడ్డికి చెందిన స్కార్పియో వాహనాన్ని కట్టెలు, రాళ్లతో ధ్వంసం చేశాయి. వివరాలు.. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు భాస్కర్ రెడ్డి బుధవారం సాయంత్రం తన వ్యవసాయ తోటకు వెళ్లారు. ఈ క్రమంలో టీడీపీ నాయకుడు నాగమునిరెడ్డి అనుచరులు ఎంసీ లక్ష్మీరంగారెడ్డి,త్రినాథ రెడ్డి, రంగస్వామి రెడ్డి, గుత్తి వెంకట రెడ్డి(రొడ్డా), కె. సూర్యనారాయణ రెడ్డి, కేవీ వెంకట నారాయణ రెడ్డి, పవన్ కుమార్ రెడ్డి, వెంకట రెడ్డి (నక్కప్ప), మొలక శ్రీరాములు, కే. చంద్రశేఖర్ రెడ్డి (చింతలపల్లి),జయరామి రెడ్డితో పాటు మరో 9 మంది భాస్కర్ రెడ్డి ఇంటి వద్దకు వెళ్లారు. 'రేయ్ భాస్కర్ రెడ్డీ.. బయటకు రారా నీ అంతు చూసేందుకే వచ్చాం' అంటూ ఈలలు, కేకలు వేస్తూ హల్‌చల్ చేశారు. స్థానికులను భయభ్రాంతులకు గురి చేశారు. అక్కడే ఉన్న భాస్కర్ రెడ్డికి చెందిన స్కార్పియో వాహనంపై దాడి చేశారు. రాళ్లు, కట్టెలతో అద్దాలు పగులగొట్టారు. అడ్డొచ్చిన భాస్కర్ రెడ్డి భార్య జయప్రదను తోసేశారు. భయాందోళనకు గురైన ఆమె వెంటనే భాస్కర్ రెడ్డికి ఫోన్ చేసి విషయం తెలియజేసింది. సమాచారం అందుకున్న సీఐ ఈరన్న వెంగన్నపల్లికి చేరుకొని బాధితులతో మాట్లాడారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు సీఐ ఈరన్న తెలిపారు. కాగా, పచ్చ మూకలు అంతకుముందు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు పంపిరెడ్డిపై కూడా దాడి చేసేందుకు ఆయన ఇంటి వద్దకు వెళ్లినట్లు తెలిసింది. అయితే, పంపిరెడ్డి లేకపోవడంతో వెనుదిరిగారు.



వినాయక విగ్రహాల శోభాయాత్ర సందర్భంగా కిక్కిరిసిన అనంతపురం టవర్‌క్లాక్ ప్రాంతం



అనంతపురం శివారు రాచానపల్లి వంకలో వినాయక ప్రతిమను నిమజ్జనం చేస్తున్న దృశ్యం

వినాయకా.. సెలవిక



శోభాయాత్రలో సప్తగిరిసర్కిల్ గణేశుడు

అనంతపురం కల్చరల్: భక్తజనం పోటెత్తారు. గణపతి బప్పా మోరియా, గణేష్ మహరాజ్‌కీ జై నినాదాలతో మార్మోగించారు. 5 రోజులుగా విశేష పూజలందుకున్న విఘ్ననాయకుడు ఇక సెలవంటూ గంగమ్మ ఒడికి చేరాడు. బుధవారం అనంతపురంలో లంబోదరుడి విగ్రహాల నిమజ్జనోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. స్థానిక సప్తగిరి సర్కిల్లోని వినాయకచౌక్ వద్ద గణేశుడి శోభాయత్రను ఎస్పీ జగదీష్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వినాయక చవితి ప్రాశస్త్యాన్ని వివరించారు.

వెల్లివిరిసిన ఉత్సాహం..

శోభాయాత్రలో పెద్ద సంఖ్యలో నగరవాసులు పాల్గొన్నారు. సప్తగిరి సర్కిల్ వినాయకుడితో పాటు నిమజ్జనానికి తరలిపోతున్న ఇతర గణనాథుల విగ్రహాలను కనులారా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సప్తగిరి సర్కిల్ నుంచి టవర్‌క్లాక్ వరకూ ప్రాంతం కిక్కిరిసిపోయింది. చిన్నాపెద్దా తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. యువకులు, చిన్నారులు ఆనందంలో మునిగితేలారు. డ్యాన్సులు చేసుకుంటూ ఉత్సాహంతో కేరింతలు కొట్టారు. కళాకారులు పౌరాణిక వేషాలతో ఆకట్టుకున్నారు. భక్తుల జయజయధ్వానాలు అందుకున్న గౌరీ పుత్రుడు.. ఇక సెలవంటూ గంగమ్మ ఒడికి చేరాడు.



గంగమ్మ ఒడిలోకి చేరుకుంటున్న గణేశుడు



వినాయక నిమజ్జనోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ జగదీష్, ప్రజాప్రతినిధులు



చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన



వినాయకుడి శోభాయాత్ర సందర్భంగా భక్తులతో నిండిపోయిన సప్తగిరి సర్కిల్

అన్నదాతల ఆశలపై నీళ్లు..!

- ఐఏబీ సమావేశం మళ్లీ వాయిదా
- ఖరీఫ్ ముగిసినా అందని సాగునీరు
- ఉపకాల్వలకు నీటి విడుదలపై స్పష్టమైన ప్రకటన లేని వైనం
- పంటలకు నీరందించడంలో కూటమి ప్రభుత్వం విఫలం

తుంగభద్ర ప్రాజెక్టు నిండుకుండలా ఉన్నా జిల్లాలో ఆయకట్టు భూములు మాత్రం బీళ్లుగా దర్శనమిస్తున్నాయి. సకాలంలో సాగునీరు అందించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఆయకట్టుకు ఎప్పటి నుంచి సాగునీరు ఇస్తారో.. అసలు ఇస్తారో ఇవ్వరో.. ఏ పంటలు సాగు చేసుకోవాలో తెలియక రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఐఏబీ (సాగునీటి సలహామండలి సమావేశం) నిర్వహించి ఉప కాల్వలకు ఎప్పటి నుంచి, ఎన్నిరోజుల పాటు సాగునీరు ఇస్తారో చెప్పాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. గురువారం (నేడు) సమావేశం జరుపుతామని రైతన్నలకు ఆశపెట్టి మళ్లీ వాయిదా వేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గతంలో హెచ్చెల్సీకి వచ్చిన నీరు, ఆయకట్టు వివరాలు

సంవత్సరం	హెచ్చెల్సీకి వచ్చిన నీరు (టీఎంసీల్లో)	ఆయకట్టు (ఎకరాల్లో)
2018-19	23.149	1,05,493
2019-20	27.134	1,00,734
2020-21	28.184	98,517
2021-22	36.50	87,685
2022-23	36.50	85,398

అనంతపురం సెంట్రల్: జిల్లా ఆయకట్టు రైతులకు తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ) ప్రధాన ఆదరవు. సుమారు లక్ష ఎకరాలకు పైగా ఏటా సాగునీరు అందిస్తోంది. తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి 32 టీఎంసీల నికర జలాల కేటాయింపులు ఉండగా, ఏటా దామాషా ప్రకారం నీటిని విడుదల చేస్తున్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో స్పష్టమైన విధానంతో ముందుకెళ్లారు. జూలై నెలలోనే ఐఏబీ సమావేశం నిర్వహించి ఏ ఉప కాల్వలకు ఎప్పటి నుంచి నీరందిస్తారనే విషయం రైతులకు తెలియజేశారు. దాని ప్రకారం రైతులు నార్లు పోసుకొని పొలాలను సిద్ధం చేసుకొని పంటలు పండించుకున్నారు.



తుంగభద్ర జలాశయం

నేడు పూర్తిగా భిన్నం..

అటు తుంగభద్ర జలాశయం.. ఇటు శ్రీశైలం జలాశయాలు నెల రోజులుగా పొంగి పొర్లుతున్నాయి. అయినా, పరిస్థితులను అంచనా వేసుకొని జిల్లాకు నీటిని తీసుకురావడంలో నేడు ప్రజాప్రతినిధులు విఫమయ్యారు. జలాశయాలు నిండే వరకూ హెచ్చెల్సీకి, హంద్రీనీవాకు నీటిని విడుదల చేయలేదు. ప్రస్తుతం టీబీ డ్యాంలో 101 టీఎంసీల నీరు నిల్వ ఉండగా 1,850 క్యూసెక్కుల చొప్పున హెచ్చెల్సీకి విడుదలవుతున్నాయి. ఇప్పటి వరకూ డ్యాం నుంచి 7.066 టీఎంసీలు మాత్రమే విడుదల చేయగా జిల్లా సరిహద్దులోకి 6.662 టీఎంసీలు చేరాయి. ఆ నీటిని హెచ్ఎల్ఎంసీ, జీబీసీ కింద ఆయకట్టుకు విడుదల చేయడంతో పాటు తాగునీటికి పోనూ పీఏబీఆర్, ఎంపీఆర్‌లో నిల్వ చేస్తున్నారు. ప్రస్తుతం పీఏబీఆర్‌లో 2.018 టీఎంసీలు, ఎంపీఆర్‌లో 1.366 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. మరో నెలరోజులకు కూడా పంటలకు సాగునీరు విడుదల చేసే స్థాయికి ఈ రిజర్వాయర్లు చేరుకోని పరిస్థితి నెలకొంది. చివరకు గణేషుని నిమజ్జనానికి కూడా హెచ్చెల్సీకి నీటిని విడుదల చేయలేని దుస్థితి దాపురించింది.

హెచ్ఎన్ఎస్ఎస్ పరిస్థితీ అంతే..

హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు పరిస్థితి కూడా ఘోరంగానే ఉంది. శ్రీశైలం జలాశయం 212 టీఎంసీలతో నిండుకుండలా ఉన్నా కేవలం 1,350 క్యూసెక్కుల నీటిని మాత్రమే తోడుకుంటున్నారు. జిల్లాకు వచ్చే సరికి 1,000 క్యూసెక్కుల లోపే ఉంటున్నాయి. ఇప్పటి వరకూ 3.803 టీఎంసీల నీరు మాత్రమే వచ్చాయి. శ్రీశైలం జలాశయంలో మిగులు జలాల నుంచి 40 టీఎంసీలు తీసుకునే అవకాశమున్నా నేటికీ అరకొరగానే పంపింగ్ చేస్తున్నారు. 2 వేల క్యూసెక్కులకు పైగా సామర్థ్యం ఉన్నప్పటికీ హంద్రీనీవా ద్వారా కేవలం 1,350 క్యూసెక్కులే పంప్ చేస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పూర్తి స్థాయి నీటిమట్టం ఉన్నప్పుడు ఖరీఫ్‌లోనే నీటిని విడుదల చేస్తే పంటల సాగుకు ఎక్కువ తడులు అవసరం ఉండదు. దీంతో చివరి ఆయకట్టు వరకూ సాగునీరును తీసుకెళ్లవచ్చు. ప్రస్తుతం రబీలోకి వెళుతుండడంతో ఆరుతడి పంటలే శరణ్యం కావడంతో పాటు చివరి రైతుకు సాగునీరు అందకపోవచ్చుననే ఆందోళన వ్యక్తమవుతోంది.

ప్రణాళికతో నీటి పంపిణీ



తుంగభద్ర జలాశయం నుంచి ఈ ఏడాది ఆశించిన స్థాయిలో నీరు వస్తున్నాయి. ఈ ఏడాది పంటల సాగుకు ఢోకా లేదు. వచ్చిన నీటిని హెచ్ఎల్ఎంసీ, జీబీసీలకు వదలడంతో పాటు తాగునీటికి పీఏబీఆర్, ఎంపీఆర్‌లలో నిల్వ చేస్తున్నాం. ఆరు తడి పంటలు శ్రేయస్కరమని భావిస్తున్నాం. వర్షాలను బట్టి పంటలకు అవసరం లేనప్పుడు ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతి అమలు చేస్తాం. ఐఏబీ సమావేశంలో ప్రజాప్రతినిధుల సలహాలు, సూచనలు తీసుకొని ప్రణాళికబద్ధంగా నీటిని పంపిణీ చేస్తాం.

– ఎస్. రాజశేఖర్, ఎస్ఈ, హెచ్చెల్సీ

ఈ-క్రాప్ బుకింగ్ పక్కాగా జరగాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: జిల్లాలో ఈ-క్రాప్ బుకింగ్ ప్రక్రియ పక్కాగా జరగాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. రైతు సాగు చేసిన పంటనే నమోదు చేయాలని చెప్పారు. చిన్నపాటి తప్పిదాలకూ తావివ్వకూడదన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మతో కలిసి వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ క్రాప్ బుకింగ్ సెప్టెంబరు 15లోగా పూర్తి చేయాలని చెప్పారు. కౌలు రైతులకు కార్డుల జారీ పూర్తి చేయాలన్నారు. ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేసి పంట సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని ఆదేశించారు.

సేవల వివరాలు ప్రజలకు తెలియాలి..

'మండలస్థాయిలో అందే సేవల వివరాలు ప్రజలకు తెలియాలి. వీటిపై తహసీల్దారు, ఎంపీడీఓ కార్యాలయాల్లో బోర్డు ప్రదర్శించాలి' అని కలెక్టర్ వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి ఆర్డీఓలు, తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు, ఇతర మండల స్థాయి అధికారులతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అందే అర్జీలను గడువు కంటే ముందే పరిష్కరించాలని చెప్పారు. కొందరు అధికారులు సమస్య పరిష్కరించకుండానే పరిష్కరించినట్లు చూపుతున్నారని, ఇది సరైన విధానం కాదన్నారు. అర్జీదారు సంతృప్తి చెందేలా సమస్యను పరిష్కరించడంతో పాటు ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. రెవెన్యూశాఖకు సంబంధించి వచ్చిన 1,346 అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

అక్రమ మద్యం రవాణా.. ముద్దాయికి మూడేళ్ల జైలు

- రూ.2 లక్షల జరిమానా విధించిన పెనుకొండ కోర్టు

పుట్టపర్తి టౌన్/గోరంట్ల: కర్ణాటక మద్యం అక్రమ రవాణా కేసులో నేరం రుజువుకావడంతో ముద్దాయి షేక్ నూర్‌మహమ్మద్‌కు మూడేళ్ల జైలు శిక్ష, రూ.2 లక్షల జరిమానా విధిస్తూ పెనుకొండ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జడ్జి బొజ్జప్ప బుధవారం తీర్పు వెలువరించారు. వివరాల్లోకి వెళితే... వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురానికి చెందిన షేక్ నూర్‌మహమ్మద్ 2020 జూలై 18న కర్ణాటక నుంచి మద్యాన్ని అక్రమంగా తీసుకువెళ్తున్నాడు. ఈ క్రమంలోనే అప్పటి గోరంట్ల సీఐ జయానాయక్ వాహనాలు తనిఖీ చేస్తున్నారు. అదే సమయంలో అటుగా వచ్చిన షేక్ నూర్ మహమ్మద్ వాహనాన్ని నిలిపి సోదాలు చేశారు. కర్ణాటక మద్యం లభ్యం కావడంతో అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసు బుధవారం విచారణకు వచ్చింది. నేరం రుజువుకావడంతో ముద్దాయి షేక్ నూర్‌మహమ్మద్‌కు మూడేళ్ల జైలు శిక్ష, రూ.2 లక్షల జరిమానా విధిస్తూ పెనుకొండ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జడ్జి బొజ్జప్ప తీర్పు చెప్పారు. ముద్దాయికి శిక్ష పడేలా కేసు వాదించిన ఏపీపీ శ్యామల, సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టిన కానిస్టేబుల్ కరుణాకర్‌రెడ్డి, భాస్కర్‌ను ఎస్పీ రత్న ప్రత్యేకంగా అభినందించారు.

9 మంది తహసీల్దార్లకు పోస్టింగ్

అనంతపురం అర్బన్: జిల్లాలో 9 మంది తహసీల్దార్లకు పోస్టింగ్ ఇచ్చారు. ఈ మేరకు కలెక్టర్ వి.వినోద్ కుమార్ బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. గత నెలలో తహసీల్దార్ల బదిలీలు జరిగాయి. అయితే కొందరు తహసీల్దార్లు వివిధ కారణాలతో జాయిన్ కాలేదు. దీంతో వారికి మరోసారి పోస్టింగ్ ఇచ్చారు. శ్రీ సత్యసాయి జిల్లా నుంచి జిల్లాకు ఇద్దరు తహసీల్దార్లు వస్తుండగా ఇక్కడి నుంచి ఇద్దరు అక్కడికి బదిలీపై వెళుతున్నారు. సత్యసాయి జిల్లా నుంచి ఎస్.ఖతీజన్‌ఖుబ్రా, జి.నాగరాజు జిల్లాకు వస్తున్నారు. వీరి స్థానంలో ఇక్కడి నుంచి జి.మారుతి (ఏఓ కలెక్టరేట్), డి.నీలకంఠరెడ్డి శ్రీసత్యసాయి జిల్లాకు వెళుతున్నారు.

కూడేరు ఖాళీ..

కూడేరు మండలానికి తహసీల్దారుగా ఎవరికీ పోస్టింగ్ ఇవ్వకుండా ఖాళీగా ఉంచారు. దీని వెనుక రాజకీయ ప్రమేయం ఉన్నట్లు రెవెన్యూ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఓ ప్రజాప్రతినిధికి పీఏగా పని చేస్తున్న వ్యక్తి బంధువైన డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) ప్రస్తుతం వేరొక మండలంలో విధులు నిర్వర్తిస్తున్నారని తెలిసింది. ఆ డీటీని కూడేరుకు బదిలీ చేయించుకుని ఆయనకు తహసీల్దారుగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించేలా ప్రయత్నం జరుగుతున్నట్లు సమాచారం.

తహసీల్దారు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
కె.మోహన్‌కుమార్	కూడేరు	అనంతపురం రూరల్
పి.రజాక్‌వలి	సూపరింటెండెంట్, కలెక్టరేట్	తాడిపత్రి
పి.ఉషారాణి	డీఏఓ, గుంతకల్లు	పెద్దవడుగూరు
వై.భూషణం	పెద్దవడుగూరు	డీఏఓ గుంతకల్లు
ఎన్.ఈశ్వరమ్మ	తాడిపత్రి	డీఏఓ,కళ్యాణదుర్గం
జి.అలెగ్జాండర్	రాయదుర్గం	పరిపాలనాధికారి, కలెక్టరేట్
బి.వాణిశ్రీ	అనంతపురం రూరల్	కె.ఆర్.ఆర్.సీ. సూపరింటెండెంట్ కలెక్టరేట్
ఎస్.ఖతీజన్‌ఖుబ్రా	శ్రీసత్యసాయి జిల్లా	సూపరింటెండెంట్, కో-ఆర్డినేషన్ విభాగం, కలెక్టరేట్
జి.నాగరాజు	శ్రీసత్యసాయి జిల్లా	రాయదుర్గం

లోకేష్ మాట... నీటి మూట

- సత్యసాయి ప్రాజెక్టు దత్తతపై ఎన్నికలకు ముందు లోకేష్ హామీ
- జీతాలందక కార్మికులు నేడు కన్నీరు పెడుతున్నా పట్టని వైనం
- 'శ్రీరామరెడ్డి' కార్మికులదీ అదే దుస్థితి
- తప్పని పరిస్థితుల్లో సమ్మెలోకి
- ఉమ్మడి జిల్లాలో 1,650 గ్రామాలకు నిలిచిన మంచి నీటి సరఫరా
- ఇబ్బందులు పడుతున్న గ్రామీణులు

వారంతా చిరుజీవులు. తాగునీరు సరఫరా చేస్తూ ఆ వచ్చే జీతంతో పొట్ట పోసుకుంటున్నారు. అలాంటి వారి ఓట్లు దండుకునేందుకు గత ఎన్నికలకు ముందు చంద్రబాబు కుమారుడు లోకేష్ లేని ఆశలు కల్పించారు. తాము అధికారంలోకి వస్తే దత్తత తీసుకుని జీవితాలే మార్చేస్తాం అంటూ హామీ ఇచ్చారు. ఆ హామీ గురించి నేడు పట్టించుకోకపోవడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


కూడేరు సమీపంలో ఏర్పాటు చేసిన శ్రీరామరెడ్డి తాగునీటి సరఫరా ప్రాజెక్టు

కూడేరు: సత్యసాయి, శ్రీరామరెడ్డి తాగునీటి ప్రాజెక్టుల్లో పని చేస్తున్న కార్మికులు తమ డిమాండ్ల సాధనకు ఈ నెల 5 నుంచి సమ్మెబాట పట్టారు. ఆయా ప్రాజెక్టుల వద్ద, మండల కేంద్రాల్లోని తహసీల్దారు కార్యాలయ వద్ద కార్మికులు నిరసనలు, రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నారు. ఫలితంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1,650 గ్రామాలకు మంచి నీటి సరఫరా నిలిచిపోయింది.

నెరవేరని లోకేష్ హామీ..

కార్మికుల పట్ల కూటమి ప్రభుత్వం కనికరం చూపడం లేదు. సత్యసాయి తాగునీటి ప్రాజెక్టును దత్తత తీసుకుని కార్మికులకు జీతాలు సక్రమంగా అందేలా చూస్తానని గతంలో పుట్టపర్తిలో జరిగిన యువగళం సభలో నారా లోకేష్ హామీ ఇచ్చారు. నేడు అధికారంలోకి వచ్చి లోకేష్ మంత్రిగా బాధ్యతలు చేపట్టినా ఆ విషయం గురించే పట్టించుకోకపోవడంతో కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలకు ఇక్కట్లు..

కూడేరు మండల పరిధిలోని పీఏబీఆర్ డ్యాం సమీపంలో సత్యసాయి, శ్రీరామరెడ్డి, అనంత, ఉరవకొండ, కూడేరు తాగునీటి ప్రాజెక్టులను ఏర్పాటు చేశారు. సుమారు 1,172 మంది కార్మికులు వీటిల్లో పనిచేస్తున్నారు. ప్రాజెక్టుల ద్వారా ఉరవకొండ, అనంతపురం, రాప్తాడు, హిందూపురం, కళ్యాణదుర్గం, రాయదుర్గం, గుత్తి, మడకశిర నియోజకవర్గాల్లోని వందలాది గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోంది. లక్షలాది మంది దాహార్తి తీరుతోంది. కార్మికుల సమ్మె కారణంగా నేడు నీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా, అధికారులు, ప్రభుత్వంలో చలనం లేకపోవడం గమనార్హం.

14 నుంచి సీపీడబ్ల్యూఎస్ స్కీం కార్మికులు సమ్మెలోకి..

కార్మికుల సమ్మెతో ఇప్పటికే ఉరవకొండలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో సీపీడబ్ల్యూఎస్ స్కీం (ఉరవకొండ తాగునీటి ప్రాజెక్టు) కార్మికులు కూడా సమ్మెలోకి వెళ్తుండడం ప్రజలను కలవరపరుస్తోంది. డిమాండ్ల సాధనకు ఈ నెల 14 నుంచి సమ్మె చేపడుతున్నట్లు అధికారులకు కార్మికులు సమ్మె నోటీసు అందజేశారు. ఈ క్రమంలో ఉరవకొండ లో తాగునీటి సమస్య మరింత జటిలం కానుంది.

కార్మికులతో చర్చలు విఫలం


పీఏబీఆర్‌లో జలదీక్ష చేస్తున్న కార్మికులు

శ్రీరామరెడ్డి, సత్యసాయి తాగునీటి ప్రాజెక్టుల కార్మికులతో బుధవారం అధికారులు జరిగిప చర్చలు విఫలమయ్యాయి. సమ్మెలో భాగంగా కార్మికులు పీఏబీఆర్‌లో అర్ధనగ్నగా జలదీక్ష చేపట్టారు. వీరికి సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులతో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఎహసాన్ బాషా, ఆర్డీఓ వసంతబాబు, తహసీల్దార్ మహబూబ్ బాషా చర్చలు జరిపారు. అయితే, కార్మికుల డిమాండ్లపై అధికారులు స్పష్టమైన ఇవ్వకపోవడంతో చర్చలు విఫలమయ్యాయి.

పెట్రోల్ కొట్టిద్దామన్నా డబ్బుల్లేవు



ఈ నెల 5 నుంచి సమ్మెలోకి వెళతామని జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులకు నోటీసు ఇచ్చాం. నెలల తరబడి జీతాలు అందక అవస్థలు పడుతున్నాం. కనీసం విధులకు వెళ్లడానికి ద్విచక్ర వాహనానికి పెట్రోల్ వేయించుకోవడానికి కూడా డబ్బులు లేవు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పిన అధికారులు పట్టించుకోవడం లేదు.

– శ్రీనివాసులు, సత్యసాయి ప్రాజెక్టు కార్మికుల యూనియన్ జిల్లా జనరల్ సెక్రటరీ

జీవనం భారమవుతోంది



ప్రాజెక్టులో 600 మంది కార్మికులు పని చేస్తున్నాం. మాకు ఇచ్చే జీతాలు అంతంత మాత్రమే. అవి కూడా నెలల తరబడి పెండింగ్ పెట్టడంతో కుటుంబ పోషణ భారమవుతోంది. కాంట్రాక్టర్‌ను అడిగితే ప్రభుత్వం నుంచి బడ్జెట్ రావాలంటున్నారు. అధికారుల్లో ఏమాత్రం చలనం లేదు. కార్మికుల సమస్యల పట్ల నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి డిమాండ్లు పరిష్కరించాలి.

– ఎర్రిస్వామి, శ్రీరామరెడ్డి తాగునీటి ప్రాజెక్టు కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు

లోకేష్ మాట నిలబెట్టుకోవాలి



సత్యసాయి తాగునీటి ప్రాజెక్టును దత్తత తీసుకుని తాగునీటి కార్మికులకు జీతాలు సక్రమంగా అందేలా చూస్తానని గతంలో పుట్టపర్తిలో జరిగిన యువగళం సభలో నారా లోకేష్ హామీ ఇచ్చారు. కూటమి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఇప్పటికైనా మంత్రి లోకేష్ స్పందించాలి. తాగునీటి కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి. లేదంటే పెద్ద ఎత్తున నిరసన చేపడతాం.

– ఓబులు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

క్లుప్తంగా

పీఏబీఆర్‌లో పెరుగుతున్న నీటి మట్టం


పీఏబీఆర్‌లో నిల్వ ఉన్న నీరు

కూడేరు: మండలంలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)లో నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువన ఉన్న తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీ ద్వారా 459 క్యూసెక్కులు, జీడిపల్లి రిజర్వాయర్ నుంచి హెచ్ఎన్ఎస్ఎస్ కెనాల్ ద్వారా 44 క్యూసెక్కులు చొప్పున నీరు వచ్చి చేరుతోంది. బుధవారం నాటికి పీఏబీఆర్‌లో 2.018 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇరిగేషన్ జేఈఈ లక్ష్మీదేవి తెలిపారు. అనంత, ఉరవకొండ, కూడేరు, సత్యసాయి, శ్రీరామరెడ్డి తాగునీటి ప్రాజెక్టులకు రోజుకు 60 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వ్యక్తి బలవన్మరణం

బ్రహ్మసముద్రం: మండలంలోని పాలవెంకటాపురం గ్రామానికి చెందిన గొల్ల శ్రీనివాసులు (40) ఆత్మహత్య చేసుకున్నాడు. కొంత కాలంగా మూత్రంలో రక్తం వస్తుండడంతో పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందాడు. అయినా నయం కాలేదు. మూత్రం పోస్తున్నప్పుడు కలిగే బాధను భరించలేక జీవితంపై విరక్తితో బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

14 మందికి ఉద్యోగ నియామక ఉత్తర్వులు


దివ్యాంగుడికి ఉద్యోగ నియామక పత్రం అందజేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: 'ఈ రోజు నుంచి ఉద్యోగులుగా మీరు కొత్త జీవితం ఆరంభిస్తున్నారు. బాధ్యతగా విధులు నిర్వర్తించి అందరి మన్ననలు పొంది మంచి పేరు తెచ్చుకోండి' అని దివ్యాంగులకు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సూచించారు. 2022–23 సంబంధించి బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో 14 మంది దివ్యాంగులకు ఉద్యోగ నియామక పత్రాలను కలెక్టర్ అందజేశారు. వారంతా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, పరిపాలనాధికారి మారుతి పాల్గొన్నారు.

ప్రపంచ దేశాల్లోనే అగ్రగామిగా భారత్‌ను నిలుపుదాం

- సెంట్రల్ యూనివర్సిటీ వీసీ కోరి


సదస్సులో పాల్గొన్న సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు

బుక్కరాయసముద్రం: ప్రపంచ దేశాల్లోనే భారత దేశాన్ని అగ్రగామిగా నిలిపేలా ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని సెంట్రల్ యూనివర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ కోరి అన్నారు. బీకేఎస్ మండలం జంతలూరులో ఉన్న సెంట్రల్ యూనివర్సిటీలో సెమికాన్ ఇండియా–2024 సదస్సు నిర్వహించారు. ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో పాల్గొని ప్రసంగించారు. అనంతరం వీసీ కోరి, వర్సిటీ డీన్ డాక్టర్ ప్రొఫెసర్ శీలారెడ్డి మాట్లాడుతూ.. సెమీ కండక్టర్ పరిశ్రమలో ప్రస్తుత పోకడలను విద్యార్థులకు తెలియజేయడానికి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ డేటా సైన్స్ విభాగం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. సెమికండక్టర్ డిజైన్‌లో సాంకేతికంగా భారతదేశాన్ని ప్రపంచదేశాల్లోనే అగ్రగామిగా ఉంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. 250 మందికి పైగా ఎగ్జిబిటర్లు, 150 మంది స్పీకర్లు ఈ సదస్సులో పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ డేటా సైన్స్ విభాగాధిపతి డాక్టర్ కృష్ణప్రియ, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

'అమిలినేని' ట్యాంకర్లను అడ్డుకున్న 'బండారు' అనుచరులు


శింగనమల చెరువు వద్ద ఎస్ఆర్‌సీ ట్యాంకర్లను అడ్డుకుంటున్న ఎమ్మెల్యే శ్రావణి అనుచరులు

శింగనమల: కళ్యాణదుర్గం టీడీపీ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు చెందిన ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ నీటి ట్యాంకర్లను శింగనమల టీడీపీ ఎమ్మెల్యే బండారు శ్రావణి అనుచరులు బుధవారం అడ్డుకున్నారు. శింగనమల చెరువు నుంచి నీటిని అక్రమంగా ఎలా తరలిస్తారంటూ ట్యాంకర్ డ్రైవర్లను నిలదీశారు. దీంతో చెరువు వద్ద ఉద్రిక్తత నెలకొంది. కాగా, అనంతపురం – విజయవాడ మధ్య నిర్మిస్తున్న 544–డీ జాతీయ రహదారి పనులను ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ చేపట్టిన విషయం తెలిసిందే. ఈ పనులకు సంబంధించి అవసరమైన నీటిని శింగనమల చెరువు నుంచి రోజూ ఒక్కొక్క ట్యాంకరుకు 30 వేల లీటర్లు చొప్పున 20కి పైగా ట్యాంకర్ల ద్వారా తరలిస్తున్నారు. దీనిపై అధికారులను ఆరా తీసిన స్థానిక టీడీపీ నేతలు... చెరువులో నీరు తరలించేందుకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని ఇరిగేషన్ అధికారులు తెలపడంతో అవాక్కయ్యారు. దీంతో బుధవారం చెరువు వద్దకు చేరుకున్న ట్యాంకర్లను అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న సీఐ కౌలుట్లయ్య, వీఆర్వో తాతయ్య అక్కడకు చేరుకుని శ్రావణి అనుచరులతో మాట్లాడారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుంటానని భరోసానిచ్చినా స్థానిక టీడీపీ నాయకులు ఒప్పుకోలేదు. దీంతో ఖాళీ ట్యాంకర్లను అక్కడి నుంచి బయటకు పంపడంతో వివాదం సద్దుమణిగింది.

కారు ఢీకొని యువకుడి మృతి


రమేష్‌నాయక్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎంపీ రంగయ్య (ఇన్‌సెట్‌లో) రమేష్‌నాయక్

కంబదూరు: ఇన్నోవా వాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుమ్మఘట్ట మండలం మారెంపల్లి తండాకు చెందిన రమేష్‌నాయక్(28) బుధవారం ఉదయం హిందూపురం నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. కంబదూరు మండలం కదిరిదేవరపల్లి వద్దకు చేరుకోగానే ఎదురుగా వేగంగా వస్తున్న ఇన్నోవా వాహనం ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడిన రమేష్‌నాయక్‌ను స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై ఎస్ఐ ఆంజనేయులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎంపీ తలారి రంగయ్య కళ్యాణదుర్గం సీహెచ్‌సీలో ఉన్న రమేష్ నాయక్ మృతదేహాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి ఉన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత


పట్టుబడిన రేషన్ బియ్యం వాహనాన్ని చూపుతున్న పోలీసులు

బొమ్మనహాళ్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, వాహనాన్ని సీజ్ చేసినట్లు బొమ్మనహాళ్ ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. వివరాలను ఆయన వెల్లడించారు. ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు బుధవారం ఉదయం కల్లుదేవనహళ్లి బ్రిడ్జి వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన బొలెరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయడంతో 47 బస్తాల్లో (ఒక్కో బస్తాలో 50 కిలోలు) తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. కాగా, విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామానికి చెందిన చంద్రశేఖర్, రామకృష్ణ, బొజ్జిరెడ్డి, బొమ్మనహాళ్ మండలం ఉప్పరహాళ్ గ్రామానికి చెందిన గంగాధర వివిధ గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి బళ్లారికి అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లుగా నిర్ధారణ కావడంతో నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వాహనంతో పాటు పాల్తూరు గ్రామానికి చెందిన చంద్రశేఖర్, రామకృష్ణ, బొజ్జిరెడ్డి పట్టుపడ్డారని, పరారీలో ఉన్న గంగాధర్ కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తెల్లారితే పెళ్లి.. ప్రమాదంలో పెళ్లికొడుకుకు గాయాలు

అనంతపురం: నగర పరిధిలోని టీవీ టవర్ సమీపంలో జరిగిన చోటు చేసుకున్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిలో ఒకరు పెళ్లికొడుకు ఉన్నారు. వివరాలు.. బత్తలపల్లి మండలం లింగారెడ్డిపల్లికి చెందిన ఈశ్వరయ్య, తరుణ్ బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై అనంతపురానికి వస్తూ టీవీ టవర్ సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా వస్తున్న రంగస్వామి బైక్‌ను ఢీకొన్నారు. ఘటనలో ముగ్గురూ కిందపడి గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఈశ్వరయ్యకు గురువారం పెళ్లి జరగాల్సి ఉంది. పెళ్లికొడుకు దుస్తులు తీసుకెళ్లేందుకు వస్తూ ప్రమాదానికి లోనయ్యారు. తరుణ్‌కు కాలు విరిగింది. ఈశ్వరయ్యకు స్వల్ప గాయాలయ్యాయి.

పశుశాఖ బదిలీల్లో రాజకీయం

అనంతపురం అగ్రికల్చర్: పశుసంవర్ధకశాఖలో ఇద్దరు పశువైద్యుల పదోన్నతి బదిలీల్లో రాజకీయం జోక్యం చేసుకుంది. ఫలితంగా ఒక్కరోజు వ్యవధిలో జీఓ మార్పు చేసినట్లు ఆ శాఖ వర్గాల్లో జోరుగా చర్చ సాగుతోంది. కొర్రపాడు పశువుల ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్ పెద్దన్నకు ఏడీగా పదోన్నతి కల్పిస్తూ స్థానిక జేడీ కార్యాలయంలో ఖాళీగా స్థానానికి బదిలీ చేశారు. అలాగే బొమ్మనహాళ్ డాక్టర్ ఉమామహేశ్వర్‌ను ఉరవకొండ ప్రాంతీయ పశువైద్యశాల ఏడీగా పదోన్నతి ఇస్తూ సోమవారం రాత్రి బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఇరువురు అధికారులు మంగళవారం జాయినింగ్ కోసం జేడీ కార్యాలయానికి వెళ్లితే... ఆ శాఖ ఉన్నతాధికారులు నిరాకరించారు. జేడీ కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఏడీ పోస్టుకు కళ్యాణదుర్గం నియోజక వర్గ పరిధిలో పనిచేస్తున్న ఓ అధికారి పెద్ద ఎత్తున రాజకీయ లాబీయింగ్ చేయడంతో డాక్టర్ పెద్దన్న కంగుతిన్నారు. జేడీ కార్యాలయంలో ఉన్న ఏడీ పోస్టు విషయంలో ఇరువురు ఎమ్మెల్యేలు అడ్డుపడినట్లు సమాచారం. దీంతో మంగళవారం రాత్రికి మరో జీఓ వెలువడినట్లు సమాచారం. డాక్టర్ పెద్దన్నను ఉరవకొండ ప్రాంతీయ ఆసుపత్రి ఏడీగానూ, ఉమామహేశ్వర్‌ను ఉరవకొండ డీడీ కార్యాలయ ఏడీగా మార్పు చేసి ఉత్తర్వులు ఇచ్చినట్లు చెబుతున్నారు. సరే ఉరవకొండలోనైనా జాయిన్ అవుదామని భావించినా ఈ జీఓను హోల్డ్‌లో పెట్టినట్లు సదరు అధికారులు వాపోతున్నారు. ఎప్పుడో వచ్చే బదిలీ ఉత్తర్వుల కోసం ప్రస్తుతం తమకు వచ్చిన అవకాశాన్ని రాజకీయంగా అడ్డుకోవడం మంచి పద్ధతి కాదని సదరు అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముందుగానే చెప్పివున్నా తాము వేరే స్థానాలను ఎంపిక చేసుకునేవాళ్లమని అంటున్నారు. ఈ పరిణామాలు ఆ శాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. అలాగే కొత్తగా వచ్చిన జేడీకి కూడా ఈ పరిస్థితి ఇబ్బందికరంగా మారినట్లు చెబుతున్నారు.

ఊరగాయ, మసాలా పొడర్ తయారీపై శిక్షణ

అనంతపురం: పచ్చళ్లు, ఊరగాయ, మసాలా పొడర్, అప్పడాల తయారీపై నిరుద్యోగ మహిళలకు రూడ్‌సెట్ సంస్థలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు ఆ సంస్థ డైరెక్టర్ ఎస్.విజయలక్ష్మి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 19 నుంచి 10 రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుంది. శిక్షణాకాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన 19 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ మహిళలు అర్హులు. పూర్తి వివరాలకు 94409 05479లో సంప్రదించవచ్చు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి

శింగనమల: వినాయక చవితి నిమజ్జనం సందర్భంగా శింగనమల మండలం సోదనపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ నాయకులు దాడికి తెగబడ్డారు. ఘటనపై పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ నెల 9న సోదనపల్లిలో వినాయక ప్రతిమ నిమజ్జనం జరిగింది. ఆ సమయంలో వైఎస్సార్‌సీపీకి చెందిన కార్యకర్త జానగొండ ఆది ట్రాక్టర్‌పై వినాయకుడి ప్రతిమను ఎక్కించి డ్రైవర్ శ్రీరాములు పక్కన కూర్చొని ఊరేగింపుగా బయలుదేరాడు. మార్గం మధ్యలో టీడీపీ కార్యకర్తలు రామాంజనేయులు, శ్రీనివాసులు, తిరుపాలు, తదితరులు పదుల సంఖ్యలో అడ్డుకుని తమ ట్రాక్టరే ముందు వెళ్లాలని పట్టుబట్టారు. కులం పేరుతో దూషిస్తూ దాడి చేశారు. ఘటనపై పోలీసులకు బాధితుడు ఆది ఫిర్యాదు చేయడంతో బుధవారం ఉదయం ఆ గ్రామంలో సీఐ కౌలుట్లయ్య విచారణ చేపట్టారు.

టీడీపీ నాయకుల దాడి


చికిత్స పొందుతున్న నాగేంద్రప్ప

బ్రహ్మసముద్రం : మండలంలోని భైరవానితిప్ప పంచాయతీ పోలేపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగేంద్రప్పపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు దాడి చేశారు. మంగళవారం రాత్రి తన పొలం వద్ద టీడీపీ నాయకులు జేసీబీతో పనులు చేస్తుండగా నాగేంద్రప్ప సర్దిచెప్పబోయాడు. జేసీబీ తవ్వుతున్న మార్గంలో సాగునీటి పైప్‌లైన్ ఉందని, పైప్‌లైన్ దెబ్బతినకుండా పగటి పూట పనులు చేపట్టాలని సూచించాడు. దీంతో అప్పటికే పీకల దాక మద్యం మత్తులో ఉన్న టీడీపీ నాయకులు వన్నూరుస్వామి, లక్ష్మణ్ణ, తిప్పేస్వామి రెచ్చిపోయారు. దుర్భాషలాడుతూ కర్రలతో దాడికి తెగబడ్డారు. తమకిష్టం వచ్చినట్లు పనులు చేసుకుంటామని అడిగేందుకు నీవెవ్వరూ అంటూ జేసీబీలోని ఇనుపరాడ్ తీసుకుని దాడికి ప్రయత్నించబోగా స్థానికులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న నాగేంద్రప్ప కుటుంబసభ్యులు అక్కడకు చేరుకునేలోపు టీడీపీ నాయకులు ఉడాయించారు. తీవ్రంగా గాయపడిన నాగేంద్రప్పను కళ్యాణదుర్గం సీహెచ్‌సీలో చేర్పించారు.

గణేష్ నిమజ్జనంలో అపశ్రుతి


సగానికి విరిగిన విగ్రహం

తాడిపత్రి అర్బన్: గణేష్ నిమజ్జనంలో అపశ్రుతి చోటు చేసుకుంది. తాడిపత్రిలో బుధవారం వినాయక ప్రతిమలను నిమజ్జనానికి తరలిస్తుండగా విద్యుత్ తీగలు తగిలి విగ్రహం సగానికి విరిగిపడింది. సాయంత్రం 5గంటల ప్రాంతంలో చేనేత కాలనీ నుంచి అశోక్ పిల్లర్ వైపుగా పెట్రోల్ బంక్ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. ఘటనలో లారీ వెనుక ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో పరిస్థితి విషమంగా ఉన్న ఒకరిని అనంతపురానికి రెఫర్ చేశారు.

యువకుడి హత్య

- జిల్లా కేంద్రంలో చెలరేగిన తాగుబోతులు
- బీరు బాటిల్ పగిలిపోయిందంటూ ఘర్షణ
- కత్తితో విచక్షణారహితంగా దాడి


హతుడు శ్రీధర్

అనంతపురం: గణనాథుడి నిమజ్జనం వేడుకల్లో అందరూ సందడి చేస్తుంటే మరో వైపు తాగుబోతులు చెలరేగి పోయారు. మద్యం మత్తులో ఓ యువకుడిని మట్టుబెట్టారు. బుధవారం రాత్రి అనంతపురంలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని రాజానగర్‌కు చెందిన శ్రీధర్ (27) అక్క, బావ నవోదయ కాలనీలో నివాసముంటున్నారు. ఈ క్రమంలో అప్పుడప్పుడు అక్క ఇంటికి శ్రీధర్ వచ్చి వెళ్లేవాడు. బుధవారం వినాయక నిమజ్జనం కార్యక్రమానికి రావాలని అక్క కోరడంతో శ్రీధర్ నవోదయ కాలనీకి వెళ్లాడు. ఆ సమయంలో అప్పటికే తనకు పరిచయమున్న తేజ, తదితరులు కలవడంతో అందరూ కలసి శ్మశాన వాటిక వద్ద మద్యం సేవించారు. బీరు బాటిలు అందిపుచ్చుకునే క్రమంలో శ్రీధర్ చెయ్యి జారి కిందపడి పగిలిపోయింది. దీంతో తేజ గొడవ పడ్డాడు. ఇద్దరి మధ్య మాటామాట పెరగడంతో స్నేహితులు సర్దిచెప్పి పంపారు. విషయం తెలుసుకున్న శ్రీధర్ బంధువులు బీరు బాటిలు తెప్పించి ఇస్తామంటూ తేజకు నచ్చ చెప్పబోయారు. అయినా తేజా వినకుండా మద్యం మత్తులో దుర్భాషలాడుతుండడంతో బీరు బాటిలు తెప్పించకుంటే ఏమి చేస్తావంటూ శ్రీధర్ తిరగబడ్డాడు. దీంతో తేజా మరింత రెచ్చిపోయి తన బొడ్డులో దాచుకున్న కత్తి తీసి శ్రీధర్‌పై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన శ్రీధర్‌ను ఆయన బావ జగదీష్ వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాడు. చికిత్స అందేలోపు శ్రీధర్ మృతి చెందాడు. ఘటనపై వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ యాదవ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, హతుడు శ్రీధర్ తండ్రి కొన్నేళ్ల క్రితమే మృతి చెందాడు. తల్లి నల్లమ్మ, భార్య, మూడు నెలల చిన్నారి ఉన్నారు.

నేటి నుంచి రెండు మ్యాచ్‌లు



ప్రాక్టీస్ చేస్తున్న క్రికెటర్లు, మ్యాచ్ రెఫరీతో మాట్లాడుతున్న ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్

అనంతపురం: అనంత క్రీడాగ్రామం వేదికగా గురువారం నుంచి దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లు రెండేసి చొప్పున జరుగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను నిర్వాహకులు పూర్తి చేశారు. కాగా, టీమిండియా విధ్వంసకర ఆటగాడు రింకూసింగ్ మళ్లీ రెడ్‌బాల్ ఆడేందుకు సిద్ధమయ్యాడు. దులీప్ ట్రోఫీ–2024లో ఇండియా–బీ జట్టు తరఫున అతను ప్రాతినిధ్యం వహించనున్నాడు. కాగా, ఇండియా – బీ జట్టులోని యశస్వి జైస్వాల్, రిషభ్‌పంత్, యశ్‌దయాల్ బంగ్లాతో టెస్ట్ సిరీస్‌కు ఎంపికయ్యారు. దీంతో రింకూసింగ్‌తో పాటు ఉత్తరప్రదేశ్ ఆటగాడు ఆకిబ్‌ఖాన్‌కు దులీప్ ట్రోఫీలో ఆడే అవకాశం దక్కింది. ఇప్పటికే అనంతపురానికి చేరుకున్న రింకూసింగ్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ... దులీప్ ట్రోఫీలో ఆడేందుకు అవకాశం వచ్చినందుకు చాలా ఆనందంగా ఉందన్నాడు. మొదట జట్టును ప్రకటించినప్పుడు తన పేరు జాబితాలో లేదని, ఇప్పుడు పిలుపు రావడంతో సంతోషంగా ఉందన్నాడు. కాగా, గురువారం నాడు గ్రౌండ్–ఏలో ఇండియా–ఏ, డీ జట్లు తలపడనున్నాయి. అలాగే గ్రౌండ్–బీలో ఇండియా–బీ, సీ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది.

క్లుప్తంగా

చిత్తశుద్ధితో రాజ్యాంగం అమలు



కలెక్టర్ వినోద్ కుమార్‌కు రాజ్యాంగం ప్రతిని అందజేస్తున్న ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు

అనంతపురం అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందించిన రాజ్యాంగాన్ని చిత్తశుద్ధితో అమలు చేద్దామని కలెక్టర్ వి.వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం నాయకులు కలెక్టర్‌ను కలిసి రాజ్యాంగ ప్రతిని అందజేశారు. అదే విధంగా డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డికీ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాజ్యాంగం విలువలను కాపాడుతూ పౌరులు, ఉద్యోగుల ప్రాథమిక హక్కులకు భంగంగా వాటిల్లకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాజ్యాంగ ఫలాలు సామాన్యుడికీ అందేలా సమష్టిగా కృషి చేద్దామన్నారు. అనంతరం ఉద్యోగుల బదిలీల అంశాన్ని సంఘం నాయకులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. బదిలీల్లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు ప్రాధాన్యత స్థానాల్లో పోస్టింగ్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా ప్రక్రియ నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి వీఎం రవిశంకర్, కేంద్ర కార్యవర్గ సభ్యుడు సోమశేఖర్, సభ్యులు శ్యాంబాబు, సుగప్ప, భానుప్రకాష్, డాక్టర్ నారాయణస్వామి పాల్గొన్నారు.

తాహా బ్యూటీ ట్రెండ్స్‌లో అగ్ని ప్రమాదం

అనంతపురం: సాయినగర్ నాలుగో క్రాస్‌లో ఉన్న తాహా బ్యూటీ పార్లర్‌లో బుధవారం ఉదయం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గమనించిన సిబ్బంది అప్రమత్తమై బయటకు పరుగులు తీశారు. అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో అగ్నిమాపక శాఖ అధికారి లింగమయ్య తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరకున్నారు. ఈ ప్రమాదంలో రూ.8 లక్షల నష్టం వాటిల్లినట్లు తాహా బ్యూటీ పార్లర్ నిర్వాహకులు తెలిపారు. విలువైన బ్యూటీ ప్రొడక్ట్స్ కూడా కాలిపోయాయి.

నేత్రపర్వంగా రాధాష్టమి



అలంకరణలో రాధా పార్థసారధులు

అనంతపురం కల్చరల్: అనంత ఇస్కాన్ మందిరం రాధాష్టమి వేడుకలతో కళకళలాడింది. హరేకృష్ణ హరే రామ నామస్మరణతో మార్మోగింది. బుధవారం రాధారాణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వందలాది మంది ఇస్కాన్ సభ్యులు రాధాష్టమి వేడుకలను సంబరంగా జరుపుకున్నారు. ఉదయం పాలు, తేనెతో ఉత్సవ విగ్రహాలకు అభిషేకం నిర్వహించారు. అనంతరం మందిర ప్రతినిధి శ్రీకృష్ణమాధవదాసు ప్రభు ప్రవచనంలో రాధాపార్థసారధుల ఆవిర్భావ విశిష్టత, పురాణ ఘట్టాలను వివరించారు.

వివేకానంద జీవితం ఆదర్శప్రాయం



స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: భారత జాతిని ఆధ్యాత్మిక, శాస్త్రీయత వైపు మళ్లించిన స్వామి వివేకానంద జీవితం ఆదర్శప్రాయమని పలువురు వక్తలన్నారు. స్వామి వివేకానంద చికాగోలో ప్రసంగించిన ప్రత్యేక దినాన్ని బుధవారం స్థానిక శ్రీరామకృష్ణ సేవా సమితి, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు వేడుకగా జరుపుకున్నారు. స్థానిక టవర్‌క్లాక్ వద్ద ఉన్న స్వామి వివేకానంద విగ్రహం వరకూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సేవా సమితి ప్రతినిధులు శ్రీధరమూర్తి, వేద్రాద్రి ప్రవీణ్ కుమార్, ఇన్నర్‌వీల్ శ్రీవల్లి, జయంతి తదితరులు మాట్లాడుతూ.. స్వామి వివేకానంద ఆశయాలను ప్రచారం చేయడమే లక్ష్యంగా రామకృష్ణ సేవా సమితి నిరంతరం శ్రమిస్తోందన్నారు. యువతీ యువకులందరూ భాగస్వాములు కావాలని కోరారు. భారతదేశం తరపున ప్రతినిధిగా సామాన్య సాధువుగా వెళ్లిన స్వామి వివేకానంద సెప్టెంబర్ 11న చికాగో ప్రసంగం అనంతరం ప్రపంచం మెచ్చిన శాస్త్రీయతతో కూడిన ఆధ్యాత్మిక స్వరూపంగా మారిపోయారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వేణుగోపాలరావు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

ఆత్మకూరు: స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న ఆర్టీటీ పాఠశాలలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ వరలక్ష్మి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శాంతిరాం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు ఉచితంగా కంటి పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు.

గణపతి బప్పా మోరియా..



రాచానపల్లి వద్ద వంకలో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు



హంద్రీ–నీవా కాలువలో గణపయ్య నిమజ్జనం



గణపయ్య ఊరేగింపులో చిన్నారుల సందడి



రాప్తాడులో నిమజ్జనానికి తరలుతున్న గణపతి

అనంతపురంలో వినాయక నిమజ్జన సందడి నెలకొంది. ఐదు రోజులుగా పూజలందుకున్న గణపయ్యలకు బుధవారం పూజలు చేపట్టారు. మధ్యాహ్నం 3 గంటలకు నగరంలో శోభాయాత్ర ప్రారంభమైంది. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ ఉత్సాహంగా వినాయకుడి ఊరేగింపులో పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని పెద్ద పెద్ద వినాయక విగ్రహాలను ఆత్మకూరు మండలం పంపనూరు వద్ద ఉన్న హంద్రీ–నీవా కాలువలో నిమజ్జనం చేశారు. నిమజ్జనం జరిగే ప్రదేశంలో పెద్ద పెద్ద లైట్లను ఏర్పాటు చేశారు. అదే విధంగా ఫైర్ సిబ్బంది, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. కాలువపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఇటుకులపల్లి సీఐ హేమంత్ కుమార్ జాగ్రత్తలు తీసుకున్నారు. రాప్తాడు మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్‌లో బుధవారం గణేశ్ నిమజ్జనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లు, ఆటోల్లో గణపయ్యలను కొలువుదీర్చి గ్రామ వీధుల్లో ఊరేగించారు. జై గణేశా.. జైజై గణేశా.. జై బోలో గణేష్ మహరాజ్‌కి జై.. పార్వతి తనయ.. విఘ్నేశా అంటూ డప్పుచప్పుళ్ల మధ్య నృత్యం చేశారు. రంగులు చల్లుకుంటూ, టపాసులు పేల్చుతూ యువత సందడి చేశారు. గొరవయ్యలు నృత్యాలు చేస్తూ అలరించారు. చిన్మయనగర్ విగ్రహాలతో పాటు అనంతపురంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వినాయకులను పండమేరు వంక, పండమేరు వంకపై ఉన్న ఆర్డీటీ చెక్ డ్యాంలో నిమజ్జనం చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ టీ.వీ.శ్రీహర్ష బందోబస్తు ఏర్పాటు చేశారు. – ఆత్మకూరు/రాప్తాడు:



రాచకొండ వినాయకుడిని నిమజ్జనానికి తీసుకొచ్చిన దృశ్యం



రాప్తాడులో యువత సందడి



టవర్ క్లాక్ వద్ద భక్తుల కోలాహలం



శోభాయాత్ర ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ వసీం, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్యే దగ్గుపాటి, ఇతర ప్రజాప్రతినిధులు



నిమజ్జనానికి తరలుతున్న భారీ వినాయకుడు



సెల్ఫీలు తీసుకుంటున్న యువత



కోలాటం ఆడుతున్న దృశ్యం



వినాయకుడి ఊరేగింపులో నృత్యం చేస్తున్న మహిళలు

మాలలను నిర్లక్ష్యం చేస్తే సహించం

అనంతపురం టవర్‌క్లాక్: రాష్ట్ర వ్యాప్తంగా అత్యధికంగా ఉన్న మాలలను నిర్లక్ష్యం చేస్తే కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని మాల వర్గీకరణ పోరాట సమితి అధ్యక్షుడు కోట్ల గంగాధర్ అన్నారు. బుధవారం స్థానిక రామనగర్‌లోని క్రిసెంట్ స్కూల్ వద్ద నుంచి ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా జిల్లా పరిషత్ ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కోట్ల గంగాధర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ వల్ల ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టి మాలలకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు. వచ్చే ఎనికల్లో సత్తా చూపిస్తామన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కళ్లు తెరచి ఎస్సీ వర్గీకరణను తక్షణమే ఆపాలన్నారు. లేని పక్షంలో ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి ఆధ్వర్యంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు ఓబులేసు, ఉపాధ్యక్షుడు దాసరి రామూర్తి, ప్రధాన కార్యదర్శి రామన్న, ట్రెజరర్ శివలింగ మూర్తి, సహాయ కార్యదర్శులు శ్రీనివాసులు, చలపతి, సుబ్బరాయుడు, నాయకులు నాగప్ప, రామాంజనేయులు, గోవర్ధన్, రామాంజనేయులు, బాబు, సురేంద్ర, ముత్యాలప్ప, జయరామ్, సోమశేఖర్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సమితి నాయకులు

రూరల్ మండల తహసీల్దార్ వచ్చారోచ్..

- నెల రోజులకు పైగా తహసీల్దార్ లేక ఇబ్బందులు పడిన ప్రజలు
- బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ మోహన్ కుమార్



మోహన్ కుమార్, తహసీల్దార్

రాప్తాడురూరల్: ఎట్టకేలకు అనంతపురం రూరల్ మండలానికి కొత్త తహసీల్దార్ వచ్చారు. సాధారణ ఎన్నికలు ముగిసిన తర్వాత జరిగిన తహసీల్దార్ల బదిలీల్లో భాగంగా ఇక్కడికి నియమించిన వాణిశ్రీ చార్జ్ తీసుకోలేదు. దాదాపు నెల రోజులు దాటినా తహసీల్దార్ లేక రూరల్ మండల పరిధిలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ క్రమంలో మోహన్ కుమార్‌ను ఇక్కడికి నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఉదయం తహసీల్దార్ మోహన్‌కుమార్ కార్యాలయానికి చేరుకుని బాధ్యతలు తీసుకున్నారు. ఈయన గతంలోనూ ఇక్కడ పని చేసిన అనుభవం ఉంది. కార్యాలయ సిబ్బంది, వీఆర్‌ఓలు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కంప్యూటర్ ఆపరేటర్ ఆగడాలకుకు చెక్ పడేనా?

తహసీల్దార్ డిజిటల్ కీ వ్యవహారం చూసుకునే కంప్యూటర్ ఆపరేటర్ ఆగడాలకు ఇప్పటికైనా చెక్ పడుతుందా? అనే చర్చ జరుగుతోంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే కులం, ఆదాయం, ఇంటిగ్రేటెడ్, ఈడబ్ల్యూఎస్ తదితర సర్టిఫికెట్లను తహసీల్దార్ అప్రూవల్ చేయాల్సి ఉంటుంది. తన చేయి తడిపే వారికి వెంటనే అప్రూవల్ చేయిస్తున్నారు. ఎవరైనా గట్టిగా అడిగితే కొర్రీలు వేస్తూ వారి సర్టిఫికెట్లను పెండింగ్ పెడుతున్నారు. కంప్యూటర్ ఆపరేటర్ వ్యవహారంపై తహసీల్దార్ మోహన్ కుమార్ దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

వ్యాధుల నిర్ధారణపై పశువైద్యులకు శిక్షణ

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక పశువ్యాధి నిర్ధారణ కేంద్రం (అనిమల్ డీసీసెస్ డయోగ్నస్టిక్ ల్యాబ్–ఏడీ డీఎల్)లో ఏడీ డాక్టర్ ఎస్.రామచంద్ర, పశువైద్యురాలు డాక్టర్ శృతి బుధవారం నియోజకవర్గ స్థాయి వెటర్నరీ ప్రయోగశాల పరిధిలో ఎంపిక చేసిన కొందరు పశువైద్యులకు వ్యాధుల నిర్ధారణపై శిక్షణ ఇచ్చారు. పశువులు, జీవాలకు వ్యాపిస్తున్న అంటు వ్యాధులు, సీజనల్ వ్యాధులు, ఇతరత్రా ప్రాణాంతక వ్యాధులను ప్రాథమికంగా ఎలా గుర్తించాలనే అంశంపై వివిధ రకాల అవయవ పరీక్షల ద్వారా ప్రయోగాత్మకంగా వివరించారు. వ్యాధి నిర్ధారణలో పాటించాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, రక్తం, మల, మూత్ర పరీక్షల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పశువులు, జీవాల పెంపకందారులు నష్టపోకుండా క్షేత్రస్థాయిలోనే వాటిని గుర్తించి నివారించడానికి నియోజక వర్గ స్థాయి ప్రయోగశాలలు క్రియాశీలక పాత్ర పోషించాలని గుర్తు చేశారు. అందుకోసం ఎప్పటికపుడు పరిజ్ఞానం, నివారణ చర్యలు, పాడి రైతులు, జీవాల కాపర్లు తీసుకోవాల్సిన ముందస్తు చర్యల గురించి తెలుసుకోవాలని సూచించారు. శిక్షణకు పెనుకొండ, తాడిమర్రి, శింగనమల, రాయదుర్గం పరిధిలో కొందరు డాక్టర్లు హాజరయ్యారు.



వ్యాధుల నిర్ధారణపై పశువైద్యులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ రామచంద్ర, డాక్టర్ శృతి

ఆయకట్టుకు 130 రోజులు సాగునీరివ్వాలి

అనంతపురం అర్బన్: జిల్లాలోని అన్ని ప్రాంతాలు, రైతుల ప్రయోజనం లక్ష్యంగా ఐఏబీ (ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు) సమావేశం జరగాలని ఏపీ రైతు సంఘం డిమాండ్ చేసింది. బుధవారం స్థానిక సంఘం కార్యాలయంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. తుంగభద్ర డ్యామ్‌కు పూర్తిస్థాయిలో నీరు రావడంతో ఈ ఏడాది పంట సాగు చేసుకోవచ్చనే సంతోషంలో ఆయకట్టు రైతులు ఉన్నారన్నారు. అయితే ఆరుతడి పంటలు వేసుకోవాలని నీటిపారుదల శాఖ అధికారులు సూచిస్తుండటంతో రైతుల్లో ఆందోళన నెలకొందన్నారు. రైతులకు ప్రయోజనం చేకూర్చేలా ఐఏబీ సమావేశంలో తీర్మానాలు చేయాలన్నారు. హంద్రీ–నీవా నీటిని తాగునీటికి 10 టీఎంసీలు కేటాయించాలన్నారు. హెచ్ఎల్‌సీ ఆయకట్టుకు, మిడ్‌పెన్నార్ కింద నున్న ఉత్తర, దక్షిణ కాలువల కింద ఉన్న ఆయకట్టుకు 130 రోజులు పూర్తిస్థాయిలో సాగునీరు ఇచ్చేలా తీర్మానం చేయాలన్నారు. పామిడిలో 2019లో జరిగిన బహిరంగ సభలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు హంద్రీ–నీవా కాలవను 6,800 క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచుతామని ప్రకటించారనే విషయాన్ని గుర్తు చేస్తూ.. ప్రస్తుత ముఖ్యమంత్రిగా ఆయన ఉన్నారు కాబట్టి కాలువ వెడల్పునకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించేలా ప్రజాప్రతినిధులు ఒత్తిడి తేవాలన్నారు. తుంగభద్ర డ్యామ్ భద్రతపై కమిటీ ఇచ్చిన నివేదిక అమలుకు ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక ప్రభుత్వాలు చర్యలు తీసుకునేలా ప్రజాప్రతినిధులు ప్రయత్నం చేయాలన్నారు.



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

స్టాఫ్‌నర్సులకు న్యాయం చేయాలి

అనంతపురం మెడికల్: కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా రోగులకు మెరుగైన సేవలందించడంతో పాటు విధుల్లో అంకితభావంతో విధులు నిర్వర్తిస్తున్న స్టాఫ్‌నర్సులకు ప్రభుత్వం న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సు అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో స్టాఫ్‌నర్సులు ఆందోళన కొనసాగించారు. స్టాఫ్ నర్సులు చేపడుతున్న ధర్నాకు పలు ఉద్యోగ సంఘాలు, హెడ్‌నర్సులు, రెగ్యులర్ స్టాఫ్‌నర్సులు మద్దతు తెలిపారు. వారు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి కాంట్రాక్ట్ ప్రాతిపదికన విధులు నిర్వర్తిస్తున్న తమపై ప్రభుత్వం ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జీఓ ఎంఎస్ నంబర్ 115తో కేవలం ఇన్‌సర్వీస్ స్టాఫ్ నర్సులకు లబ్ధి చేకూరుతుందన్నారు. దీని ద్వారా తమకు ఒరిగేదేం లేదన్నారు. కొన్నేళ్లుగా బోధనాస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న తమపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో హెడ్‌నర్సులు ఆర్‌బీ పద్మ, ఆశాలత, మహాలక్ష్మి, ఆదిలక్ష్మి, రెగ్యులర్ స్టాఫ్ సంధ్య, జరీన, కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు శ్రీదేవి, శోభ, మానస, కీర్తి, నీలిమ, ప్రసన్న, శ్రీవిద్య, కళావతి, వీణ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు

నసనకోట ముత్యాలన్న ఇంటిపై పరిటాల వర్గీయుల రాళ్ల దాడి

సాక్షి టాస్క్‌ఫోర్స్: అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీడీపీ నాయకులు బరితెగించారు. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులపై దాడులు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. భౌతికదాడులతో పాటు ఆస్తులు, వాహనాల విధ్వంసానికి పాల్పడుతున్నారు. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి రామగిరి మండలం నసనకోటలో ముత్యాలమ్మ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ముత్యాలన్న ఇంటిపై రాళ్లతో దాడి చేశారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సొంత పంచాయతీలోనే ఈ ఘటన జరగడం గమనార్హం. ముత్యాలన్న గత ప్రభుత్వ హయాంలో నసనకోట ముత్యాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. పార్టీ కార్యక్రమాల్లోనూ చురుగ్గా వ్యవహరించారు. దీన్ని పరిటాల వర్గీయులు జీర్ణించుకోలేకపోయారు. గత ఎన్నికల సమయంలోనే పరిటాల శ్రీరామ్ ×నీ అంతు చూస్తా₹ అంటూ ముత్యాలన్నకు వార్నింగ్ ఇచ్చారు. దీంతో కూటమి అధికారంలోకి రాగానే ముత్యాలన్న సొంతూరు వదలి ఇతర ప్రాంతాల్లో తలదాచుకుంటున్నారు. ప్రస్తుతం నసనకోటలోని ఇంట్లో తల్లి, తమ్ముడు మాత్రమే ఉంటున్నారు. పరిటాల వర్గీయులు బుధవారం రాత్రి ఉన్నఫళంగా రాళ్ల దాడికి దిగడంతో వారు భయాందోళనకు గురై..ఇల్లు వదలి వెళ్లిపోయారు. కేవలం ఆధిపత్యం కోసమే పరిటాల వర్గీయులు ఇలా బరి తెగించినట్లు తెలుస్తోంది.